క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ ఆటోనగర్ పారిశ్రామికవాడ, 11కేవీ డీర్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉ.10 నుంచి మధ్యాహ్నం 12 విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

సబితారెడ్డికి కృతజ్ఞతలు


సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మమత

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయింది. శనివారం 22వ డివిజన్ కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. టికెట్ కేటాయించి ప్రోత్సహించడం వల్లే మొదటి సారి కార్పొరేటర్‌గా బడంగ్‌పేటలో నిలబడి విజయం సాధించామని గుర్తు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే సబితా రెడ్డి సూచించారని వారు తెలిపారు.

కందుకూరు సీఐ బదిలీ

కందుకూరు: కందుకూరు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన గత ఏడాది జూన్ నుంచి సుమారు ఏడున్నర నెలలగా ఇక్కడ విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం ఆయనను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. కాగా, ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్ నుంచి మక్బూల్ జానీ ఇక్కడికి రానున్నారు.

యూటీఎఫ్ సమావేశాన్ని విజయవంతం చేయండి

మీర్‌పేట: చేవెళ్లలో ఆదివారం జరగనున్న యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని బాలాపూర్ మండల అధ్యక్షుడు జి.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి జిల్లాలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.

విద్యుత్ సబ్ స్టేషన్లకు మరమ్మతులు


మరమ్మతులను పర్యవేక్షిస్తున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: అంతరాయం లేని కరెంట్ సరఫరా కోసం విద్యుత్ సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతులో భాగంగా శనివారం 33/11కేవీ నాగోలు, మారుతీనగర్ సబ్‌స్టేషన్లు వాటికి అనుగుణంగా ఉన్న 11కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టారు. సరూర్‌నగర్ ఆపరేషనల్ డివిజినల్ ఇంజినీర్ బి.సంగమేశ్వర, ఏడీఈలు తిరుపతయ్య, ప్రభాకర్, బాల్యానాయక్, ఏఈలు మరమ్మతులను పర్యవేక్షించారు.

నేడు మైసమ్మ బోనాలు


వివరాలు వెల్లడిస్తున్న గ్రామస్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని ఈర్లగండి మైసమ్మ బోనాల ఉత్సవాలను నేడు (ఆదివారం) నిర్వహించనున్నామని కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈర్లగండి మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మూడు రోజుల ముందు నుంచే రంగులద్ది ఆలయాన్ని ముస్తాబు చేశామన్నారు. స్థానిక కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

నేడు మండల పర్యటనకు ఎమ్మెల్యే

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- ఆ స్థలాల్లో బోర్డులు పాతాలి
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్
- సర్పంచ్‌లను ఇన్‌చార్జిలుగా కొనసాగించాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని, ఆ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునితా అంధ్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. మహేశ్వరం మండలంలోని పలు గ్రామాలు, తండాల్లోని ప్రభుత్వ, పీఓటీ భూముల్లో కొందరు అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని, ఆ భూముల్లో బోర్డులు పాతాలని ఇన్‌చార్జి ఎంపీపీ సభలో లెవనెత్తారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సబితారెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, ఆ స్థలాల్లో బోర్డులు పాతాలని తహసీల్దార్ మహమూద్ అలీని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఇటుక బట్టీల్లో యజమానులు విద్యుత్‌ను అక్రమంగా వాడుకొని ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని కోళ్లపడకల్ ఎంపీటీసీ హన్మగళ్ల చంద్రయ్య సభలో లెవనెత్తారు. ఈ విషయంపై ఏఈ మాట్లాడుతూ.. దొంగతనంగా విద్యుత్‌ను వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తుమ్మలూరులో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణం ఎత్తుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం ఎత్తును తగ్గించి, అసంపూర్తి పనులను పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని సర్పంచ్ సురేఖారెడ్డి కోరారు. రోడ్డు ఎత్తును తగ్గించి పనులు త్వరగా చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. పెద్ద గొల్కోండ ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు గత రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని డబిల్‌గూడ సర్పంచ్ శంకర్ కోరగా నిధుల మంజూరులో కొంత ఆలస్యమైందని త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. మహేశ్వరం గ్రామ పంచాయతీలో చెత్త డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్ సభ దృష్టికి తెచ్చారు. చెత్త డంపింగ్‌యార్డుకు స్థలం చూయించామని వాటిలో నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్ వివరించారు. రైతు బంధు డబ్బులు కొంత మందికే పడ్డాయని మిగతా రైతులకు వేయాలని కోరగా .. వ్యవసాయాధికారి నాగమణి స్పందిస్తూ ఇప్పటి వరకు మూడు ఎకరాలలోపు రైతులకు మాత్రమే డబ్బులు పడ్డాయని, త్వరలో మిగతా రైతులకు వేస్తామన్నారు. తుమ్మలూరులో ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని నియంతించాలని తుమ్మలూరు ఎంపీటీసీ సభ్యుడు మద్ది రామిరెడ్డి సభలో లేవనెత్తగా ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమంగా ప్రభుత్వ భూముల నుంచి మట్టి తవ్వకాలు చేపడుతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే మట్టి తవ్వకాలు చేపట్టిన వారికి పెనాల్టీలు వేసి కేసులు నమోదు చేశామన్నారు.

ఐదేళ్లు బాగా పని చేశారు.. ఎమ్మెల్యే సబితారెడ్డి

గత ఐదేళ్లు సర్పంచులు బాగా పని చేశారని, ఎన్నికలు అయ్యేంతవరకు ఇన్‌చార్జి సర్పంచ్‌లుగా కొనసాగించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు తరతరాలకు గుర్తిండిపోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా సత్ఫలితాలు సాధించామని , అందుకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాలకవర్గాలు, అధికారుల కృషి ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె. సునితానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, డీఈలు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.200 కోట్ల అభివృద్ధి


కేక్‌కట్ చేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పాలకవర్గం ఏర్పడి నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తియింది. ఈ సందర్భంగా శనివారం నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో పాలకవర్గం, అధికారులు కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల్లో రూ. 200కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రస్తుత ఏడాదిలో 32 డివిజన్లను కలిపి మరింత అభివృద్ధి చేస్తామని, సమస్యలు లేని డివిజన్‌గా అన్ని డివిజన్లను తీర్చిదిద్దుతామన్నారు. సహకారం అందిస్తున్న సహ కార్పొరేటర్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: ఎలక్ట్రీషియన్ యూనియన్(టీపీఈటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. కందుకూరు చౌరస్తాలో థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ మాట్లాడుతూ.. ప్రతి ఎలక్ట్రీషియన్ సభ్యత్వం తీసుకుని ప్రభుత్వం అందిస్తున్న రూ.10 లక్షల బీమాను పొందాలన్నారు.అలాగే లేబర్ కార్డు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు వారి కుటుంబాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు సత్తయ్య, ప్రధానకార్యదర్శి రవి, కోశాధికారి కుమార్, సలహాదారుడు చెన్నయ్య, తుక్కుగూడ ఇన్‌చార్జి యాదిరెడ్డి, సభ్యులు సంజయ్ రాథోడ్, ప్రవీణ్, సాయికిరణ్, వినోద్, శ్రీకాంత్, రాజు, రామస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

హైకోర్టుకు మరోచోట స్థలం లేదా?


చికిత్స పొందుతున్న ఝాన్సీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈటల

- ఏబీవీపీ నాయకురాలిపై పోలీసుల వైఖరి దారుణం
- బీజేపీ నేత ఈటల రాజేందర్

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూములు అమ్ముకుంటారుగానీ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం కేటాయించిన భూమి తప్ప ఇంకెక్కడా లేవా అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం ఆందోళన చేస్తున్న సమయంలో పోలీసుల దాడిలో గాయపడి కొత్తపేట ఓజోన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని శనివారం ఈటల పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు పెద్ద ఎత్తున భూములు అవసరం ఉంటుందన్నారు. ప్రాక్టికల్‌గా నేర్చుకునే కోర్సులు ఉంటాయని అలాంటి రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయ భూమిని కోర్టు నిర్మాణం కోసం కేటాయించడం సరికాదన్నారు. కోర్టులు కట్టవద్దని కాదు కోర్టుకి వ్యతిరేకంగా ఏబీవీపీ ఉద్యమాలు చేయడం లేదని అన్నారు. ఏబీవీపీ వారిపై పోలీసులు వ్యవహరించిన తీరు, ఏబీవీపీ నాయకురాలు ఝాన్సీని పోలీసులు జుట్టుపట్టుకొని లాగి కింద పడవేసిన విధానం జుగుప్సాకరంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఈటల హెచ్చరించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ సుప్రభ హనీ


సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బడంగ్‌పేట్: మండలం పరిధిలోని బడంగ్‌పేటలో ఉన్న మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సుప్రభహనీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు అంతరిక్షం, రోబోటిక్, సోషల్ సైన్స్, మాథ్స్, చిత్రలేఖనం, పర్యావరణ ఎగ్జిబిట్లు, పంటలు, మానవ శరీరంలోని భాగాలు అవి పనిచేసే విధానం, ఆయా రాష్ట్రాల్లో ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, తదితర అంశాలు ప్రదర్శించి ఔరా.. అనిపించారు. విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు నమూనాలు చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుప్రజహనీ మాట్లాడుతూ.. సైన్స్‌ఫెయిర్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తాయన్నారు. సైన్స్ ఫెయిర్‌లో పెంపొందించిన అంశాలను లక్ష్యంగా చేసుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తగా, ఇంజనీర్లుగా, గొప్ప దార్శనికులుగా మారిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులను పేరెంట్స్ ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మంజూరు చేయండి

- శివార్లలో యూజీడీ పనులకు రూ.40 కోట్లు ఇవ్వండి
- జలమండలి ఎండీకి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి


జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: శివారులోని ప్రతి కాలనీలో తాగునీటి, డ్రైనేజీ కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని శనివారం సుధీర్‌రెడ్డి జలమండలి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో నియోజకవర్గంలో 80 కిలో మీటర్ల తాగునీటి పైప్‌లైన్ మంజూరు కావడం జరిగిందని, దానికి అదనంగా మరో 18 కిలో మీటర్లు మంజూరు చేయాలని కోరారు. శివారు ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.40 కోట్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండీ పైప్‌లైన్ పనులకు నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

నో బ్యాగ్ డే

మంచాల: జాపాల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నో బ్యాగ్ డే విజయవంతంగా ముగిసింది. నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం జాపాల గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కాకర, వంగ పంటలను విద్యార్థులు పరిశీలించారు. అదే విధంగా మల్లయ్య కుండల తయారీ విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహీర్ మాట్లాడుతూ విద్యార్థులు క్షేత్ర స్థాయిలో పంటల సాగును పరిశీలించి సాగు పద్ధతులను తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెరగాలంటే తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు పరిశీలన కూడా ముఖ్యమని చెప్పారు. దీంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. డ్రిప్ సిస్టం, మల్చింగ్ కవర్, పందిరి కూరగాయాల సాగుతో పాటు పలు అంశాలను శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి మైనార్టీ నాయకులు

ఆమనగల్లు: తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు ఆ పార్టీ మైనార్టీ నాయకులు హాజరయ్యారు. సయ్యద్ ఖలీల్, అక్బర్, అనిఫ్ హాజరయ్యారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం పటిష్టత గురించి మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడినట్లు సయ్యద్ ఖలీల్ వివరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

యాచారం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ప్రకటించారు. ఫిబ్రవరి 16న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ పిలుపు మేరకు యాచారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను తుంగలో తొక్కేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. నల్లా చట్టాలతో బడా పారిశ్రామిక వేత్తలకు దేశాన్ని అమ్మే కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ఫిబ్రవరి 16న అన్ని గ్రామాల్లో సంపూర్ణ బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, తావునాయక్, చందునాయక్, బాషయ్య పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదయ్య తదితరులు

తలకొండపల్లి: చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్న చెరువులపై ముదిరాజ్‌లకే హక్కు ఉంటుందన్నారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ తలకొండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 153 సర్వే నంబర్‌లోని ఎర్రకుంట చెరువు శిఖం భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని మూడు నెలల క్రితం తహసీల్దార్ దృష్టికి తెచ్చామని, అప్పట్లో హద్దులు కూడా గుర్తించారని తెలిపారు. ఇటీవల కొందరు మళ్లీ ఆక్రమించుకొని సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అందువల్ల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ, ఉప సర్పంచ్ అనిల్, యూత్ అధ్యక్షుడు నాగరాజు, శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు


మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ నేతలు

కందుకూరు: సమస్యల పరిష్కరించాలని కోరుతూ జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ శనివారం మంత్రులను కలిశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బస్సుల సంఖ్య పెంచాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పులిమామిడిలోని చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధితో పాటు దూపదీప నైవేద్యాల కోసం దృష్టి సారించాలని కోరుతూ అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించారు. ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేయాలని మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దెబ్బడగూడ గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వానించారు.

రామగిరిగుట్ట అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న


సీసీ నిర్మాణ పనులను ప్రారంభించిన స్వప్న తదితరులు

హయత్‌నగర్: పసుమాములలోని రామగిరిగుట్ట అభివృద్ధికి కృషి చేస్తామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తెలిపారు. గుట్టపైకి వెళ్లేందుకు సరైన మార్గం లేక భక్తులు అవస్థ పడుతున్నారు. దీంతో రూ.30 లక్షల వ్యయంతో రామగిరి గుట్ట పైకి సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ రామగిరిగుట్ట జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మణెమ్మ, కో ఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, డీఈఈ అశోక్‌మార్, నాయకులు యాదయ్యగౌడ్, లింగంగౌడ్, బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, మల్లేశ్, రాజగౌడ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్‌ను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్‌ను ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ నారాయణ, మంగళపల్లి సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్యగౌడ్, గణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.